అల్పాదాయ తరగతులకు ప్లాట్ల అమ్మకం

- దరఖాస్తులకు హౌజింగ్ బోర్డు ఆహ్వానం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఏడాదికి రూ.ఆరు లక్షలలోపు ఆదాయమున్న వారి కోసం హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 339 ప్లాట్లను విక్రయించాలని హౌజింగ్ బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు గురువారం బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో 111 ప్లాట్లు, వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో 102 ప్లాట్లు, ఖమ్మం శ్రీరాంహిల్స్ వద్ద 126 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న వారికి లాటరీలో వీటిని కేటాయిస్తారు. ప్లాట్ల విస్తీర్ణం 450 చదరపు అడుగుల నుంచి 650 చదరపు అడుగుల వరకు ఉన్నాయి. గచ్చిబౌలిలో ప్లాట్ల ధరలు రూ.26 లక్షల నుంచి గరిష్టంగా రూ.36.20 లక్షలు, వరంగల్ జిల్లాలో రూ.19 లక్షల నుంచి రూ.21.50 లక్షలు, ఖమ్మంలో రూ.11.25 లక్షలకే అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో, మీ సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. గచ్చిబౌలి ప్లాట్ల కేటాయింపునకు జనవరి 6న, వరంగల్ ప్లాట్లకు 8న, ఖమ్మం ప్లాట్లకు 10న లాటరీ ప్రక్రియ నిర్వహిస్తారు. మరిన్ని వివరాలను https://tghb.cgg.gov.inలో తెలుసుకోవచ్చు.

16 స్థానాల్లో సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ అభ్యర్థుల విజయం

- ఆదరించి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు : పోటు రంగారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి 16 మంది అభ్యర్థులు సర్పంచులుగా, వంద మంది వార్డు మెంబర్లుగా గెలుపొందారనీ, 10 ఉప సర్పంచ్ స్థానాలను దక్కించుకున్నామని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. రెండు స్థానాల్లో తాము బలపర్చిన న్యూడెమోక్రసీ అభ్యర్థులు విజయం సాధించారని చెప్పారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు, తమ పార్టీతో పాటు వామపక్ష, విప్లవ పార్టీల నుంచి గెలిచిన వారికి అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సర్పంచులందరూ స్థానిక స్వపరిపాలన, నిధులు, విధులు, హక్కులను సరైన క్రమంలో అమలయ్యే చూడాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు మూడు ఎమ్‌ల (మద్యం, మాంసం, డబ్బులు) చుట్టూ పరిభ్రమించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలను జూదంలా మార్చడంతో సేవ, నిజాయితీ, రాజకీయ నిబద్ధత వంటివి పక్కకుపోయాయనీ, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ప్రలోభాల చుట్టూ తిరిగాయని ఎత్తిచూపారు. రాజకీయాలు ఇంత డబ్బుమయం అయిన ప్రస్తుత తరుణంలోనూ వామపక్ష, విప్లవ పార్టీలను ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి'లో గాంధీ పేరు తొలగించడం నేరం

- ప్రజాక్షేమం కన్నా పేర్ల మార్పుపై కేంద్రం చిల్లర రాజకీయం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టం నుంచి గాంధీ పేరును తొలగించడం క్షమించరాని నేరమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. జాతిపిత గాంధీ పేరును తొలగించిన బిజెపికి జాతీయ పార్టీ అనే నైతిక హక్కే లేదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కన్నా పేర్ల మార్పుపైనే కేంద్ర ప్రభుత్వం చిల్లర రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. పేర్ల మార్పులో, వాటిని నిర్వీర్యం చేయడంలో కాంగ్రెస్, బిజెపి దొందూదొందేనని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా బిజెపి తన సంకుచితత్వాన్ని చాటుకుందని విమర్శించారు. పల్లె ప్రజల ఉపాధిని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేదలకు రూ.ఐదుకే భోజనం అందించే 'అన్నపూర్ణ క్యాంటీన్ల' పేరును 'ఇందిరమ్మ క్యాంటీన్లు'గా మార్చడం చిల్లర రాజకీయమని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ చీరలను నిలిపేసి, నేతన్నల పొట్టకొట్టి, ఇప్పుడు వాటికి రాజకీయ రంగు పులుముతూ 'ఇందిరమ్మ చీరలు'గా మార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఆత్మగౌరవ చిహ్నమైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి, 'కాంగ్రెస్ తల్లి'ని ప్రజలపై రుద్దడం అమానుషమని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలైన రైతుబంధును రైతుభరోసాగా మార్చి రైతులకు అందకుండా చేస్తున్నారని తెలిపారు. కెసిఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌ను నిలిపేసి తల్లీబిడ్డల ఆరోగ్యంతో కాంగ్రెస్ ఆటలాడుతోందని పేర్కొన్నారు. వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అదే పేర్లతో కెసిఆర్ కొనసాగించారని గుర్తు చేశారు. ప్రజలకు మేలు చేయడం కంటే కేవలం పేర్లు మార్చి వారిని ఏమార్చడమే లక్ష్యంగా ఈ ఢిల్లీ పార్టీలు పనిచేస్తున్నాయని విమర్శించారు.

66 శాతం పంచాయతీలు మావే

- ప్రజల ఆశీర్వాదానికి ధన్యవాదాలు
- మా బాధ్యత మరింత పెరిగింది
- ప్రాదేశికి ఎన్నికలపై అసెంబ్లీలో చర్చించాకే నిర్ణయం : సిఎం



ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ 66 శాతం స్థానాల్ని కైవసం చేసుకున్నదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. 94 శాసనసభ నియోజవర్గాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగితే 87 శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ అత్యధిక ఫలితాలు సాధించిందని వివరించారు. అశీర్వదించిన ప్రజలకు ధన్యవాదాలు, కష్టపడి పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులు, కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ సీతక్క, సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా గ్రామ పంచాయతీల్లో పార్టీలు సాధించిన వివరాలను సీఎం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలోని 12,702 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ 7,527 మంది, కాంగ్రెస్ రెబల్స్ 808 మంది నెగ్గారనీ, మొత్తంగా తమ పార్టీ 8,335 గ్రామ పంచాయతీల్లో విజయం సాధించి 66 శాతం సీట్లను గెలుచుకుందని విశ్లేషించారు. బిఆర్ఎస్, బిజెపి కూటమిగా ఈ ఎన్నికల్లో పోటీచేసి 33 శాతం స్థానాలు సాధించాయని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టులు 1 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేండ్ల తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయనీ, ప్రజలు పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారనీ, ఇది ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని చెప్పారు. అలాగే కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని గుర్తుచేశారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ 66 శాతం, బిఆర్ఎస్- బిజెపి కూటమి 33 శాతానికే పరిమితం అవుతాయని జోస్యం చెప్పారు. రెండేండ్ల పాలనలో పేదలకు అందించిన సన్నబియ్యం, ఉచిత కరెంటు, సన్న వడ్లకు బోనస్, రూ.500కే సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఎస్సీ వర్గీకరణ అమలు, కులగణన వంటి అనేక పథకాలకు ప్రజలు మద్దతు ఇచ్చారని సంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజలకు ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను అందించామన్నారు. పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిపించామనీ, హెూదాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను ప్రభావితం చేసేలా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. ఈ ఫలితాలు తమపై మరింత బాధ్యతను పెంచాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం పేరు, విధానాన్ని మార్చి గ్రామీణ ఉపాధిని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా కొందరికి ఇంకా అహంకారం తగ్గలేదనీ, కడుపులో మూసీలో కాలుష్యం కంటే ఎక్కువ విషం పెట్టుకొని మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రజలకు మంచి జరుగుతుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

కేటీఆర్‌కు హరీశ్‌రావు భయం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఫెయిల్యూర్ అయ్యారని హరీశ్‌రావు టీం నాయకత్వ మార్పును డిమాండ్ చేస్తూ సోషల్ మీడియాలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నదనీ, కేటీఆర్‌కు కాంగ్రెస్ కంటే కూడా ఇప్పుడు హరీశ్‌రావు భయమే పట్టుకుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరనీ, ఈ విషయాన్ని గజ్వేల్ ప్రజలు గుర్తించి, అక్కడ మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించారని తెలిపారు.

నీటి లెక్కలపై అసెంబ్లీలో చర్చిద్దాం రండి

కృష్ణా, గోదావరి నదీజలాలపై చర్చ కోసం ప్రతిపక్షనేత హోదాలో కెసిఆర్ స్పీకర్‌కు లేఖ రాస్తే, ఆయన కోరుకున్న తేదీల్లోనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్ల బిఆర్ఎస్, కెసిఆర్ హయాంలోనే తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం జరిగిందని అభిప్రాయపడ్డారు. దీన్ని ఆధారాలతో సహా అసెంబ్లీలో నిరూపిస్తామన్నారు.

అసెంబ్లీలో చర్చించాకే..

జడ్పిటిసి, ఎంపిటిసి, స్థానిక సంస్థల ఎన్నికలపై 42 శాతం బిసి రిజర్వేషన్లపై ప్రజాస్వామ్య బద్ధంగా అసెంబ్లీలో చర్చించి ముందుకు వెళతామన్నారు. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు.

కోర్టుకు వెళ్లొచ్చు

బిఆర్ఎస్ పరిస్థితి సంతలో పిల్లల్ని అమ్ముకునే వారి కంటే దారుణంగా తయారైందని సిఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పేదరికంతో పిల్లల్ని అమ్ముకుంటున్నారంటే అర్థం ఉందనీ, కానీ కొందరు ఎమ్మెల్యేలు తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్తుంటే, మీరు మా పిల్లలే కాదని వాళ్లే వాదించుకోవడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే ఇఆర్ఎస్ నేతలు కోర్టుకు వెళ్లొచ్చని సూచించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పదే పదే తాము 37 మంది సభ్యులం ఉన్నామనీ, ఆ ప్రకారమే సమయం ఇవ్వాలని అసెంబ్లీలో స్పీకర్‌ను కోరిన విషయాన్ని ప్రస్తావించారు. అలాగే ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ స్పీకర్ ఏ పార్టీకి ఎందరు ఎమ్మెల్యేలు ఉన్నారో స్పష్టంగా బులెటిన్ విడుదల చేస్తారనీ, అప్పుడు రాని అభ్యంతరాలు ఇప్పుడెలా వచ్చాయని ప్రశ్నించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నిర్వహణ కోసం ఫిరాయింపు ఎమ్మెల్యేలుగా ఆరోపించబడుతున్న వారి జీతాల్లోంచి ప్రతినెలా రూ.5వేలు కట్ చేసుకుంటున్నారనీ చెప్పారు. రాజకీయంగా ఇంత నికృష్ట పరిస్థితి ఎవరికన్నా వస్తుందా? అని ఎద్దేవా చేశారు.

'ఎమ్మెస్ అగర్వాల్ ఫౌండ్రీస్' తీరు దుర్మార్గం

- ప్రమాద స్థల సందర్శనకు అంగీకరించని యాజమాన్యం
- కార్మికులకు న్యాయం జరిగే వరకు యాజమాన్యాన్ని వదిలిపెట్టం
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో


పరిశ్రమ గేటు వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగయపల్లి గ్రామంలోని ఎమ్మెస్ అగర్వాల్ ఫౌండ్రీస్ పరిశ్రమ యాజమాన్యం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నదని, కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న పరిశ్రమ యాజమాన్యాన్ని శిక్షించే వరకు ఉద్యమం చేస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య తెలిపారు. గురువారం సిఐటియు రాష్ట్ర ప్రతినిధి బృందం పరిశ్రమను సందర్శించి గేటు బయట కార్మికులతో మాట్లాడింది. పరిశ్రమ గేట్ ఎదుట ధర్నా నిర్వహించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. పరిశ్రమలో ప్రమాద స్థలాన్ని సందర్శించడానికి యాజమాన్యం నిరాకరించడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ప్రమాద స్థలాన్ని ఎందుకు సందర్శించనీయడం లేదని ప్రశ్నించారు. యాజమాన్యం చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, ప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు చనిపోయినా ఏమాత్రం సంబంధం లేనట్టు పరిశ్రమలో ఉత్పత్తి యథేచ్ఛగా చేస్తోందని, కార్మికుల ప్రాణాల కంటే లాభాలే ముఖ్యమా అని ప్రశ్నించారు. ప్రమాద వివరాలు చెప్పడానికి యాజమాన్యానికి ఎందుకు అంత భయమన్నారు. ప్రమాదంపై కార్మిక శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదని, వారు యాజమాన్యం కోసం పని చేస్తున్నారా? లేక కార్మికుల సంక్షేమనికి ఉన్నారా అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఎంత మందికి గాయాలు అయ్యాయో ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ నుంచి సుమారు 1500 మంది వలస కార్మికులు పరిశ్రమలో పనిచేస్తున్నారన్నారు. కంపెనీ యాజమాన్యం కార్మికులను కనీసం మనుషులుగా కూడా చూడటం లేదని, కనీస వేతనం అమలు చేయకుండా కార్మికులతో యాజమాన్యం వెట్టిచాకిరీ చేయిస్తున్నదని తెలిపారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా వారి శ్రమను దోచుకునే హక్కు యాజమాన్యానికి ఎక్కడిదన్నారు. అగర్వాల్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులతో పాటు మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ సిఐటియు పోరాడుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వివిఎస్.రావు, జిల్లా అధ్యక్షులు బాలమణి, కార్యదర్శి ఏ.మల్లేశం, ఉపాధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి, కోశాధికారి నర్సమ్మ, సహాయ కార్యదర్శులు సంతోష్, అసిఫ్, యుఇఐయు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గుడాల రవీంద్ర ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ పాల్గొన్నారు.

షాహీ మహిళా కార్మికులది ధర్మ పోరాటం

- యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలి
- వేతనాలు పెంచి సమ్మె విరమింపజేయాలి
- కార్మిక శాఖ మంత్రి జోక్యం చేసుకోవాలి : టి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేతనాలు పెంచాలంటూ పదకొండు రోజులుగా నాచారం షాహీ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ ఎదుట మహిళా కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె న్యాయబద్ధమైన ధర్మ పోరాటమని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు అన్నారు. ఈ సమ్మెపై కార్మిక శాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకుని చర్చలు జరిపి వేతనాలు పెంచి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారంలోని షాహీ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ ఎదుట సమ్మెలో ఉన్న మహిళా కార్మికులకు గురువారం కెవిపిఎస్ నాయకత్వం సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాహీ కంపెనీలో నిజాం కాలం నాటి వెట్టిచాకిరీ నేటికీ కొనసాగుతోందని విమర్శించారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ మహిళా కార్మికుల వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. సూపర్‌వైజర్లు, ఇతర విభాగాల ఉద్యోగులకు వేతనాలు పెంచుతున్న యాజమాన్యం మహిళా కార్మికుల విషయంలో మాత్రం వివక్ష చూపుతోందన్నారు. అనారోగ్య కారణాలతో విధులకు హాజరు కాలేకపోతే రూ.800 కోత విధిస్తున్నారని, కానీ రోజువారీ వేతనం మాత్రం రూ.300 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు రూ.300తో కుటుంబం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఒక కార్మికుడికి నెలకు కనీసం రూ.26,400 వేతనం ఇవ్వాల్సి ఉన్నా.. మహిళా కార్మికులు మాత్రం రూ.16 వేలే అడుగుతున్నారని అన్నారు. 11 రోజులుగా ఎండా, చలిలో రోడ్డుపై బైటాయించి మహిళా కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం వారి మొండి వైఖరికి నిదర్శనమన్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. తమ కుటుంబ పోషణ కొంత మెరుగ్గా సాగేందుకు వేతనాలు పెంచాలని మాత్రమే కోరుతున్నారన్నారు. మహిళా కార్మికుల న్యాయమైన పోరాటానికి కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా సమ్మెను కొనసాగించాలని సూచించారు.

పొగాకు నియంత్రణపై 'మాచన' అభ్యర్థనపై సుప్రీం స్పందన

హైదరాబాద్ బ్యూరో : 'విద్యార్థులు, యువత స్కూళ్ళు, కాలేజీల వద్ద సిగరెట్, పొగాకు ఉత్పత్తులకు బలి అవుతున్నారు.. దయచేసి విద్యాసంస్థల వద్ద 'నో స్మోకింగ్ జోన్'గా ప్రకటించండి.' అని పొగాకు నియంత్రణ హీరో అవార్డు గ్రహీత మాచన రఘునందన్ సుప్రీం కోర్టును అభ్యర్థించగా.. దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. గురువారం ఈ మేరకు సుప్రీం కోర్టు నుంచి రఘునందన్‌కు సమాచారం అందించారు. దేశ వ్యాప్తంగా స్కూళ్ళు, కాలేజీల వద్ద సిగరెట్, పొగాకు ఉత్పత్తుల విక్రయాల వల్ల విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు బలి అవుతున్నారని మాచన రఘునందన్ సుప్రీం కోర్టుకు విన్నవిస్తూ.. 42 పేజీలతో కూడిన సమగ్ర సమాచారాన్ని రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపారు.

ఆదిలాబాద్‌లో చలి తీవ్రతతో పాఠశాలల వేళల్లో మార్పు

- ఉదయం 9.40 నుండి 4.30 గంటలు వరకు పాఠశాలలు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత మరింత పెరిగింది. సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం 11 అయినా చలి తీవ్రత తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో పాఠశాలల సమయంలో మార్పు చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల 15 నిమిషాల వరకు నడుస్తున్న పాఠశాలల సమయాన్ని మార్చారు. ఉదయం పూట చలిలో విద్యార్థులు పాఠశాలలకు రావడానికి ఇబ్బందులు పడుతున్నందున ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4 గంటల 30 నిమిషాల వరకు పాఠశాలలను కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్‌తోపాటు ప్రయివేట్ పాఠశాలల్లో అమలు చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలల పని వేళలు మారుస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డిఇఒ రాజేశ్వర్ తెలిపారు. ఆదేశాలను ఉల్లంఘించే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ ఉత్తర్వులు శుక్రవారం నుంచి అమలులోకి వస్తాయన్నారు. ఎంఇఒలు పాఠశాలలను సందర్శించి సమయ పాలన పాటించేలా చూస్తారన్నారు. ఈ సమయ మార్పు పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులకు మినహాయింపు ఉంటుందన్నారు. ఎవరైనా ఆదేశాలను ధిక్కరించి సమయాల్లో మార్పు చేయకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గాంధీ పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా?

- ఉపాధి హామీ చట్టం పేరు మార్పు అవమానకరం
- మంత్రి పొంగులేటి వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును మార్చి గాంధీ పేరును తొలగించడం ఆయన్ను అవమానించినట్టేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గాంధీ పేరును తీసేస్తే చరిత్ర మారుతుందా?అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గాంధీ పేరును తొలగించడం సిగ్గుచేటని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో 2005లో నాటి యూపీఏ ప్రభుత్వం చారిత్రాత్మకమైన ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చిందని గుర్తు చేశారు. పదేండ్లుగా బీజేపీ ప్రభుత్వం ఆ చట్టానికి తూట్లుపొడుస్తూ నీరుగారుస్తోందని విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, రాష్ట్రాలపై 40 శాతం భారాన్ని నెట్టడం పేదల పొట్ట కొట్టడమేనని తెలిపారు. పార్లమెంట్‌లో తెచ్చిన ఈ బిల్లు అభివృద్ధి తిరోగమనమేననీ, రాష్ట్రాలపై మోయలేని భారమని పేర్కొన్నారు. వీబీ జీఆర్‌జీగా మార్చడం అన్యాయమని తెలిపారు. ఈ చట్టం పేరు మార్చడం వెనుక కేంద్ర పాలకుల సంకుచిత మనస్తత్వం కనిపిస్తోందని పేర్కొన్నారు. పేరు మార్చినంత మాత్రాన వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరని తెలిపారు. వికసిత్ భారత్ అని నినాదాలు ఇస్తూ, గ్రామీణ భారతానికి వెన్నెముకగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని అగాధంలోకి నెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, పేదల కడుపు కొడితే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

ఫలితాలతో సిఎం రేవంత్ ఫ్రస్టేషన్

- మాజీమంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

పంచాయతీ ఎన్నికల ఫలితాలను చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్ పీక్స్‌కు చేరిందని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. త్వరలోనే పతనం తప్పదనే సంగతి అర్థమై ఆయన ఆగమాగం అవుతున్నడని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే ఆయన కుర్చీ ఊడుతుందనీ, దోపిడీ ఆగిపోతుందనే భయంతో రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని తెలిపారు. తనకు, కెటిఆర్‌కు మధ్య బేధం సృష్టించాలన్న కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. తద్వారా బిఆర్ఎస్‌ను బలహీన పర్చాలని చేస్తున్నారని వివరించారు. ఆయన చిల్లర రాజకీయాలకు ఎవరు పడిపోరనీ, కుట్రలు, కుత్సితాలు ఫలించబోవని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి దాష్టీకాలు, దుర్మార్గాలకు వ్యతిరేకంగా తాను, కెటిఆర్ మరింత సమన్వయంగా, సమర్థవంతంగా రెట్టించిన ఉత్సాహంతో పోరాడతామని వివరించారు. కాంగ్రెస్ అవినీతిని ఎండగడతామనీ, అసమర్థతను నిలదీస్తామని తెలిపారు. ఉద్యమ కాలం నుంచి నేటి దాకా తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్న కాంగ్రెస్‌ను గద్దె దించుతామని పేర్కొన్నారు. తన లక్ష్యమైనా, కెటిఆర్ లక్ష్యమైనా, లక్షలాది మంది గులాబీ సైనికుల లక్ష్యమైనా ఇదేనని తెలిపారు. బిఆర్ఎస్ విజయపథంలో పురోగమించడం ఖాయమని పేర్కొన్నారు. మరోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని తెలిపారు. మిగిలిన కొద్ది కాలమైనా సరిగ్గా వినియోగించుకోవాలని రేవంత్‌రెడ్డికి సూచించారు.


గ్లోబల్ ఇమాజిన్ విన్నర్ అవార్డు అందజేస్తున్న మంత్రి లక్ష్మణ్ కుమార్

వికలాంగుల సాధికారతకు సాంకేతిక పరిజ్ఞానం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

వికలాంగుల సాధికారతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్టు రాష్ట్ర వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఎలియెన్ ఇన్నోవేషన్స్ కార్యాలయంలో నిర్వహించిన అసిస్టివ్ టెక్నాలజీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల జీవితాల్లో వెలుగు నింపేందుకు స్టార్టప్ కంపెనీలతో కలిసి కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, నూతన ఆవిష్కర్తల్లో వారి సంఖ్య పెరిగేలా వారిని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. వికలాంగులకు అవసరమైన ఉత్పత్తులను రూపొందిస్తున్న ఎలియెన్ ఇన్నోవేషన్స్ సంస్థ వ్యవస్థాపకులు రవి కిరణ్ గ్లోబల్ ఇమాజిన్ వెంచర్ విన్నర్ అవార్డు అందుకున్నారని ఆయన అభినందించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వికలాంగులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కార్పొరేట్ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. వికలాంగుల సాధికారత విషయంలో తెలంగాణ దేశానికే మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సిఇఒ మిరాజ్, యునిసెఫ్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) ఫీల్డ్ ఆఫీసర్ జెలామియాలి, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి ప్రదీప్‌తో పాటు నెట్‌వర్క్ మోడల్‌పై పనిచేస్తున్న పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విబి జీ రామ్‌జీ బిల్లు 'ఉపాధి'కి ఉరి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

హైదరాబాద్‌బ్యూరో : 'కేంద్రంలో మోడీ సర్కారు కార్మికుల నోటిలో మట్టికొట్టింది. పార్లమెంట్‌లో విపక్షాల నిరసనల మధ్య విబి జీ రామ్‌జీ బిల్లు ఆమోదించడంతో పని పొందే రాజ్యాంగ హక్కును హరించింది' అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకటరాములు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంద బలాన్ని ఉపయోగించి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడంతో పాటు గ్రామీణ ప్రాంత పెత్తందారుల, కాంట్రాక్టర్లకు మేలు చేసే విధంగా బిల్లును తీసుకు రావటమేంటని ప్రశ్నించారు. రోజువారీ వ్యవసాయ పనులు చేసే కార్మికులు పని కోసం మళ్లీ వలస బాట పట్టే పరిస్థితి రానున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. యంత్రాలతో పనిచేసే పద్ధతిని అవసరాల ప్రతిపాదక మీద పనులు ఇచ్చే పద్ధతిని ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం మాత్రమే నిధులు ఇస్తామనీ, 40శాతం డబ్బులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పడం రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపడమేనని తెలిపారు. తక్షణమే ఈ పథకాన్ని రద్దు చేయాలనీ, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఆందోళన, పోరాటాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సేవకులుగా గుర్తింపు పొందాలి

- నిజాయితీగా సేవ చేయండి.. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి
- సివిల్ సర్వీస్ అధికారుల శిక్షణ ముగింపులో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారిగా మాత్రమే కాకుండా ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు సివిల్ సర్వీసెస్ అధికారులను కోరారు. అప్పుడే సివిల్ సర్వీసెస్ హోదాకు తగిన గుర్తింపు, న్యాయం చేసిన వారు అవుతారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)లో వివిధ రాష్ట్రాలకు చెందిన 203 మంది సివిల్ సర్వీస్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి వైఎస్ చైర్‌పర్సన్ శాంతకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతిరోజు కార్యాలయాన్ని వదిలి వెళ్లే ముందు తాము చేసిన పనుల ద్వారా ఎవరి జీవితంలోనైనా మంచి మార్పు వచ్చిందా? తగిన గౌరవాన్ని తెచ్చిందా? అని తమకు తామే ప్రశ్నించుకోవాలని సూచించారు. విధుల్లో ఉన్నప్పుడు ఎంతటి కఠిన పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ముందుకు పోవాలని చెప్పారు. అప్పుడే విధి నిర్వహణలో చాలా వరకు విజయం సాధించినట్టేనని తెలిపారు. 'నిజాయితీతో సేవ చేయండి...ధైర్యంగా నిర్ణయాలను తీసుకోండి' అని కోరారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత బాధ్యత, వివేకం, విచక్షణ, విశ్వాసం పెరిగిందన్నారు. ఇంజనీర్లుగా, వైద్యులుగా, ఆర్థిక నిపుణులుగా, న్యాయవాదులుగా, సాంకేతిక నిపుణులుగా వివిధ పాత్రలు పోషించాల్సి వస్తోందని తెలిపారు. ఇక్కడ నుంచి బాధ్యతలు, బదిలీలు, క్లిష్టమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ద్వారా కొన్ని జీవితాలే తీవ్ర ప్రభావితమవుతాయని గుర్తు చేశారు. అందువల్ల విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో పని చేయాలని సూచించారు. 'పాలనలో ఒత్తిడి, కఠినమైన సందర్భాలు, మానవీయతతో కూడిన నిర్ణయాలు, ప్రజాశ్రేయస్సు కోసం శ్రమించే సందర్భాలు. ప్రశంసలు, విమర్శలు కూడా ఉంటాయి. అవన్నీ ప్రజల కోసమేనన్న భావనతో ముందుకు వెళ్లాలి' అని సూచించారు. యువ సివిల్ సర్వెంట్లుగా సమాజంతో అడుగు పెడుతున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగవంతంగా పెరుగుతోందని, దాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. మారుతున్న ఆర్థిక, వాతావరణ, భౌగోళిక, రాజకీయాంశాలను అవగాహన చేసుకోవాలన్నారు. అధికార స్థానంలో ఉన్నప్పుడు చరిత్ర, నమ్మకం, కరుణ తదితరాంశాలను ఎప్పటికీ మరువకూడదని చెప్పారు. 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో మహాత్మా గాంధీని ఒక సలహా అడిగారు. అప్పుడు గాంధీజీ స్పందిస్తూ ఎప్పుడైనా, ఏదైనా సందేహం వచ్చినప్పుడు అత్యంత పేద, బలహీనమైన వ్యక్తిని గుర్తు చేసుకోండి' అని సలహా ఇచ్చారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలతో ఎప్పుడూ సంబంధాలు కొనసాగించాలని సూచించారు. వారిని నిత్యం కలవాలనీ, వారు చెప్పేది ఓపికతో వినాలని భట్టి సూచించారు.


సివిల్ సర్వీస్ అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం

అత్యవసర వైద్యానికి 'ఆపన్నహస్తం'

- ఎమర్జెన్సీ కేర్‌పై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక ఫోకస్

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటంతో పాటు ఆపదను ఆసరాగా చేసుకుని జరిగే కార్పొరేట్ దోపిడీ నుంచి సామాన్యులను రక్షించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నడుం బిగించింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు రాష్ట్రంలో 'ఎమర్జెన్సీ హెల్త్ కేర్' వ్యవస్థలో సమూల మార్పులను క్రమంగా తీసుకొస్తున్నది. గోల్డెన్ అవర్‌లో ప్రాణరక్షణే అంతిమ లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నది. కుటుంబంలో ఎవరికైనా ప్రమాదం జరిగినా, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితులు వచ్చినా..ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి లక్షలకు లక్షలు ధారపోసి, ఆస్తులు అమ్ముకుని అప్పుల్లో కూరుకుపోయే దుస్థితి పేద, మధ్యతరగతి వర్గాలకు రాకూడదన్నదే ప్రధాన ఉద్దేశంతో సర్కారు ముందుకు సాగుతున్నది. అందులో భాగంగానే 31 క్రిటికల్ కేర్ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఒక్కో బ్లాక్‌ను రూ.28 కోట్ల వ్యయంతో వెచ్చిస్తున్నది. ప్రతి కేంద్రంలోనూ 50 పడకలతో ప్రత్యేక బ్లాకు ఏర్పాటు చేయనున్నారు. హై-ఎండ్ ఐసీయూలో 10 ఐసీయూ బెడ్లు అందుబాటులో ఉంటాయి. 6 హెచ్‌డీయూ బెడ్లు, వెంటిలేటర్లు ఉండనున్నాయి. తక్షణమే సర్జరీలు చేయడానికి 2 ఆపరేషన్ థియేటర్లను సకల సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురానున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా నెగటివ్ ప్రెషర్ వ్యవస్థతో కూడిన 24 ఐసోలేషన్ పడకలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. డయాలసిస్, ప్రసూతి సేవలు, సొంత ల్యాబ్, ఆక్సిజన్ ప్లాంట్ వంటివి ఒకే గొడుగు కింద ఉండటంతో మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంటుంది.

జనవరి 10 నుంచి ఆసియా తలసేమియా కాన్‌క్లేవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ : ఆసియా తలసేమియా కాన్‌క్లేవ్ (ఎటిసి)ని జనవరి 10, 11 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించబోతున్నట్లు తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్) వెల్లడించింది. భారతదేశంతో పాటుగా ఆసియా దేశాల నుంచి ప్రముఖ వైద్యులు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు, ప్రభుత్వేతర సంస్థలు ఈ సదస్సులో పాల్గొననున్నాయని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల సదస్సులో కొత్త తలసేమియా జననాలను తగ్గించడం లక్ష్యంగా నివారణ వ్యూహాలపై ఈ సమావేశం చర్చించనుందన్నారు.

'మకుట తరంగ్'కు విశేష స్పందన

హైదరాబాద్ : నగరంలోని కూకట్‌పల్లిలో మకుట డెవలపర్స్ అభివృద్ధి చేస్తోన్న 'మకుట తరంగ'కు లాంచ్ అనంతరం విశేష స్పందన లభిస్తున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ తమ అల్ట్రా లగ్జరీ నివాస ప్రాజెక్ట్‌కు భారీగా కొనుగోలుదారుల ఆసక్తి కనబడిందని పేర్కొంది. ఇప్పటికే అనేక యూనిట్లు విక్రయమవడం ద్వారా నగరంలోని సౌకర్యవంతమైన ప్రాంతాల్లో నాణ్యమైన లగ్జరీ ఇళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను ఇది మరింత స్పష్టం చేస్తోందని మకుట డెవలపర్స్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ జనార్ధన్ కొంపల్లి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2.8 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన మకుట తరంగలో రెండు సొగసైన 24 అంతస్తుల టవర్లు ఉన్నాయన్నారు. వీటిలో మొత్తం 250 ప్రత్యేక నివాస యూనిట్లు ఉన్నాయన్నారు.

క్రిస్మస్ డిన్నర్‌కు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

- మంత్రి మహ్మద్ అజహరుద్దీన్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి ఈ నెల 20న క్రైస్తవులకు ఇవ్వనున్న క్రిస్మస్ డిన్నర్ కార్యక్రమానికి ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని క్రిస్మస్ డిన్నర్ కార్యక్రమం నిర్వహించనున్న ఎల్‌బి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిన్నర్ కార్యక్రమానికి పది వేల మంది క్రైస్తవులు హాజరు కానున్నట్టు తెలిపారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ బి షఫిఉల్లా, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, వైస్ ఛైర్‌పర్సన్ కాంతి వెస్లీ, ఎండి సబిత తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిర్వీర్యాన్ని వ్యతిరేకిద్దాం

- గాంధీ పేరు మార్పు సరిగాదు
- వాటా నిధుల్ని తగ్గించడమంటే కేంద్రం పక్కకు తప్పుకోవడమే
- రాముడు పేరు పెట్టి పేదల పొట్ట గొట్టడం సబబు కాదు
- చట్టపరిరక్షణకు ఐక్య పోరాటాలు : జాన్‌వెస్లీ
- ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో నిరసన



ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చి నిర్వీర్యం చేసే కుట్రను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న నరేగా పేరును విబి-జి-రామ్-జిగా మార్చడాన్ని తప్పుబట్టారు. ఇలా చేయడమంటే గాంధీని అవమానపర్చడమేనన్నారు. దాన్ని యధావిధిగా చట్ట రూపంలోనే ఉంచి నిధులను పెంచాలనీ, గాంధీ పేరును మార్చొద్దని డిమాండ్ చేశారు. ఆ చట్టం పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేస్తామని ప్రకటించారు. ఆ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో వీబీ జీ రామ్ జీ-2025 బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ బిల్లు ప్రతులను దహనం చేశారు. 'ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి... విబి జీ రామ్ జీ-2025 బిల్లును వెనక్కి తీసుకోవాలి... మోడీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి' అని నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జాన్‌వెస్లీ మాట్లాడుతూ వామపక్ష పార్టీల పోరాటాలు, అప్పటి యూపీఏ ప్రభుత్వంపై ఒత్తిడితో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ వచ్చిందని గుర్తుచేశారు. వ్యవసాయ పనులు లేనప్పుడు, కరువుల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో కార్మికులకు ఉపాధి ఎంతో ఇతోధికంగా అండగా నిలిచిందనీ, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంలో కీలక పాత్ర పోషించిందని అన్నారు. అలాంటి చట్టాన్ని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్రమంగా నిధులను తగ్గిస్తూ ఏటేటా నిర్వీర్యం చేస్తూ పోతున్నదని విమర్శించారు. ఇప్పుడు తాజాగా ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ - రోజ్‌గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు (వీబీ జీ రామ్ జీ బిల్లు)-2025ను తీసుకురావాలనుకోవడం దుర్మార్గమన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, దాని స్థానంలో వీబీ జీ రామ్ జీ అనే సంక్షిప్త నామాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకించారు. పథకానికి రాముడి అర్థం వచ్చేలా పేరు పెట్టి పేదల పొట్టగొట్టేలా నిర్ణయాలు తీసుకోవడం దుర్మార్గమని విమర్శించారు. డిమాండ్‌ను తీర్చడానికి బడ్జెట్ కేటాయింపులు పెంచడం తప్పనిసరి అనీ, అయితే కేంద్ర ప్రభుత్వం 90 శాతం ఉన్న తన వాటాను 60 శాతానికి కుదించడం అంటే చట్టాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వనరులను దెబ్బతీస్తూ 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని కేంద్రం ముసాయిదా బిల్లులో పెట్టడం దుర్మార్గమన్నారు. పనిదినాలు పెంచుతామని కేంద్రం చెప్పిన దాంట్లో చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రం నిబంధనలతో కోట్లాది మంది తమ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని ఎత్తిచూపారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలనీ, పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. అసలు చట్టంలోని నిబంధనలను నీరుగార్చడానికి, దాని ద్వారా హామీ ఇవ్వబడిన పని హక్కును పరిమితం చేయడాన్ని ఎత్తి చూపారు. మోసపూరిత బిల్లును తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యకమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, రాష్ట్ర నాయకులు వెంకట్రాములు, భూపాల్, బి.ప్రసాద్, ఆశయ్య, శ్రీరాంనాయక్, ఉడుత రవీందర్, ఎం శ్రీనివాస్, బాబూరావు, వెంకటేశ్, కోట రమేశ్, విజయ్, పద్మ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాష్టీకం

- కట్నం కోసం అత్తింటి వారి వేధింపులు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ప్రేమించిన వ్యక్తితో బంగారు భవిష్యత్తు ఉంటుందని నమ్మి అతన్ని పెండ్లి చేసుకుంది. కడవరకూ అతనితోనే జీవితమని ఎన్నో కలలు కన్నది. కానీ ప్రేమను పంచాల్సిన వాడే కర్కశంగా మారి 'కాసుల' కోసం వేధింపులకు గురిచేశాడు. విచక్షణ మరిచి దారుణంగా కొట్టి చంపాడు. పెండ్లయినా 8 నెలలకే ఆ వివాహిత జీవితం ముగిసింది. ఈ విషాదకర ఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో గురువారం జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మున్సిపాలిటీ సాయిపూర్‌కు చెందిన పరమేష్, తాండూరు మండలం కరణ్‌కోట్ గ్రామానికి చెందిన అనూష (22) 8నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పరమేష్ ట్రాక్టర్ పనులు, వ్యవసాయ పనులు చేస్తాడు. అయితే వీరి వివాహం పరమేష్ తల్లిదండ్రులకు ఇష్టం లేదు. దాంతో అనూషకు అత్తగారింట్లో కట్నం కోసం కలహాలు, గొడవలు, వేధింపులు మొదలయ్యాయి. భర్త కూడా అనూషను వేధింపులకు గురిచేశాడు. దాంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. ఆ తరువాత పరమేష్ అత్తామామలతో మాట్లాడి ఆమెను తన ఇంటికి తిరిగి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో మళ్లీ ఇరువురి మధ్య కట్నం విషయంలో గొడవ జరగడంతో అనూషను పరమేష్ తీవ్రంగా కొట్టాడు. దాంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే స్థానికులు ఆమెను ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె పరిస్థితి విషమించడంతో ఆమెను అక్కడే వదిలేసి పరమేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. అప్పటికే అనూష మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి తరలించారు. అనూష మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రేమ పేరుతో నమ్మించి, కట్నం కోసం తమ బిడ్డను అతికిరాతకంగా హత్య చేశారని అనూష తల్లిదండ్రులు ఆరోపించారు. తమ బిడ్డ హత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భర్త సర్పంచ్.. భార్య ఉప సర్పంచ్..

- సంగారెడ్డి జిల్లా జగన్నాథ్‌పూర్‌లో ఎన్నిక

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్‌లో భర్త సర్పంచ్‌గా, భార్య ఉప సర్పంచ్‌గా ఎన్నికై అరుదైన రికార్డు సృష్టించారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన బీరుధర్ విజయ్ 152 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గురువారం జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికల్లో వార్డు సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరక తొలుత వాగ్వాదం జరిగింది. అనంతరం జరిగిన చర్చల్లో విజయ్ భార్య శోభను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. జోడు పదవులు ఒకే కుటుంబానికి దక్కడం విశేషం.

సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్‌ను పునరుద్ధరించాలి

- చట్టబద్ధమైన పని పద్ధతులు కల్పించాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

కంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సేల్స్ ప్రమోషన్స్ ఎంప్లాయీస్ అండ్ కండిషన్స్ ఆఫ్ సర్వీస్ యాక్ట్ 1976ను తక్షణమే పునరుద్ధరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ సంయుక్త ప్రధాన కార్యదర్శి ఏ.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో జరిగిన ధర్నాలో వీరయ్య మాట్లాడారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్‌ల న్యాయబద్ధమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కోడ్‌లతో కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పని విధానాలలో మార్పు తీసుకొచ్చి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నదన్నారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్‌లకు చట్టబద్ధమైన పని పద్ధతులను కల్పించాలన్నారు. తక్షణమే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మికుల పని విధానాలలో మార్పు తెచ్చి 8 గంటల పని విధానాన్ని 12గంటలు అంతకంటే ఎక్కువ గంటలు వెట్టిచాకిరీ చేయించుకునేలా చేసిందన్నారు. ఈ లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు కార్మికవర్గం పోరాడుతుందని తెలిపారు.

తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.భానుకిరణ్ మాట్లాడుతూ.. మెడికల్ రిప్రజెంటేటీవ్‌లపై మందుల కంపెనీల వేధింపులు అరికట్టాలని, నిర్దిష్టమైన పని పద్ధతులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే విధానాలు ఆపాలన్నారు. సంయుక్త ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై పోరాడితే తప్ప సమస్యలు పరిష్కారం కావని, పోరాటంతోనే 1976 యాక్టును పునరుద్ధరించుకోవాలని పిలుపునిచ్చారు. చట్టబద్ధమైన పని పద్ధతులను కల్పించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ తరలివచ్చారు. ధర్నాకు అధ్యక్ష వర్గంగా సిహెచ్ శ్రీధర్, ఐ.రాజు బట్టు వ్యవహరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శులు జి విద్యాసాగర్, సదానంద చారి, వి శ్రీనివాస్, కోశాధికారి దుర్గాప్రసాద్, 16 జిల్లాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై 'మాచన' అభ్యర్థనపై సుప్రీం స్పందన

- విద్యాసంస్థల వద్ద 'నో స్మోకింగ్ జోన్'పై పిల్ స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'విద్యార్థులు, యువత స్కూళ్లు, కాలేజీల వద్ద సిగరెట్, పొగాకు ఉత్పత్తులకు బలి అవుతున్నారు.. దయచేసి విద్యాసంస్థల వద్ద 'నో స్మోకింగ్ జోన్'గా ప్రకటించండి.' అని పొగాకు నియంత్రణ హీరో అవార్డు గ్రహీత మాచన రఘునందన్ సుప్రీం కోర్టును అభ్యర్థించగా.. దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. గురువారం ఈ మేరకు సుప్రీం కోర్టు నుంచి రఘునందన్‌కు సమాచారం అందించారు. దేశ వ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీల వద్ద సిగరెట్, పొగాకు ఉత్పత్తుల విక్రయాల వల్ల విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు బలి అవుతున్నారని మాచన రఘునందన్ సుప్రీం కోర్టుకు విన్నవిస్తూ.. 42 పేజీలతో కూడిన సమగ్ర సమాచారాన్ని రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపారు. ఈ విషయాన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా స్వీకరిస్తున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. మాచన రఘునందన్ 22 ఏండ్లుగా పొగాకు నియంత్రణకు అలుపెరుగని కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆగస్టులో రఘునందన్ 'టుబాకో కంట్రోల్ హీరో' అవార్డుకు ఎంపిక అయ్యారు. మాచన రఘునందన్ స్వస్థలం మేడ్చల్ జిల్లా కేశవరం గ్రామం. ఆయన నల్లగొండ జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పని చేస్తున్నారు.

అనాధ బాలల నైపుణ్యాభివృద్ధికి సహకారం

- ఎంఎన్‌జె ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు
- ఎంఇఐఎల్ డైరెక్టర్ సుధారెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్



అనాధ బాలల్లో నైపుణ్యాభివృద్ధితో పాటు ఎంఎన్‌జె కాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) డైరెక్టర్ సుధా రెడ్డి అన్నారు. తమ సంస్థ పది సంవత్సరాల నుంచి యువతలో నైపుణ్యాలను పెంచి వారు సొంత కాళ్లపై నిలబడేలా శిక్షణనిస్తున్నదని, అనాధ బాలలు కూడా అలా తమ కాళ్లపై తాము నిలబడేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ బ్లాక్‌ను ఎలా అయితే అభివృద్ధి చేసామో అలానే ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రిని కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. ముందుగా ఇక్కడి వైద్యులతో మాట్లాడి ఏమి అవసరమో తెలుసుకుని ఆ అవసరాలను తీరుస్తామన్నారు. ఎంఇఐఎల్, ఎస్‌ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో అనాధలకు చలి నుంచి రక్షణ పొందేందుకు ఉన్ని బ్లాంకెట్లను ఆమె పంపిణీ చేశారు. ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను ముద్దాడిన సుధా రెడ్డి వారికి బ్లాంకెట్స్, పండ్లు పంపిణీ చేశారు. మూసాపేటలోని సాయి సేవా సంఘ్‌లో విద్యను అభ్యసించే వారికి బ్లాంకెట్స్‌ను సుధారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో, ఆ తరువాత విలేకరులతో సుధా రెడ్డి మాట్లాడారు. నగరంలోని సాయి సేవా సంఘ్ విద్యా మందిర్‌లో అనాధలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు విద్యనభ్యసిస్తున్నారు. వారు పదో తరగతి లేదా ఆ పై చదువుల తరువాత తమ కాళ్లపై తాము నిలబడి స్వశక్తితో జీవించేందుకు తమ సంస్థ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. తనకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తి అని అన్నారు.

టెట్ వాయిదా వేయాలి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

టెట్‌ను వాయిదా వేయాలని బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేనకు లేఖ రాశారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఉపాధ్యాయులు పాల్గొన్నారని ఆయన తెలిపారు. టెట్‌కు సిద్ధమవడానికి వారికి తగిన సమయం ఇవ్వాలని ఆయన సూచించారు. వెంటనే టెట్‌ను నిర్వహించి ఒత్తిడికి గురి చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

సర్పంచ్‌గా గెలిచిన ఆటో డ్రైవర్ భార్య

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం ముర్కుంజల్ సర్పంచ్‌గా బిఆర్‌ఎస్ మద్దతుతో ఆటో డ్రైవర్ లాల్ కుమార్ భార్య అనూష ఘన విజయం సాధించారు. గతంలో పార్టీలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే తన గెలుపునకు కారణమని ఆయన మద్దతుదారులు తెలిపారు. ఆటో డ్రైవర్‌గా ఉంటూ ప్రజాసేవపై మక్కువతో పోటీ చేసిన అనూష సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఒత్తిడితో ఎంపిడిఒ మృతి

హైదరాబాద్‌బ్యూరో: ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులకు చెల్లించాల్సిన పారితోషికం విషయంలో తక్కువ చెల్లిస్తున్నారంటూ సిబ్బంది వాగ్వివాదానికి దిగడంతో ఒత్తిడికి గురైన ఎంపిడిఒ గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరులో జరిగింది. కార్యాలయం సిబ్బంది, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరుకు చెందిన జి రాజేంద్ర ప్రసాద్.. వెంకటాపురంలో ఎంపిడిఒగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరోగ్యం బాగా లేని కారణంగా కొంతకాలంగా సెలవుపై ఉన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా తిరిగి విధుల్లో చేరారు. బుధవారం మండలంలో మూడో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన అధికారులకు ఓట్ల లెక్కింపు అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో వారికి చెల్లించాల్సిన పారితోషికం తక్కువగా చెల్లిస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. దాంతో ఒత్తిడికి గురైన ఎంపిడిఒ సమీప టీ స్టాల్ వద్ద గుండెపోటుతో మృతిచెందారు.

మోడల్ స్కూల్ టీచర్లకు నోషనల్ సీనియార్టీ

- హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు
- ఉపాధ్యాయ సంఘాల హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం నోషనల్ సీనియార్టీని కల్పించింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి ఎన్ శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మోడల్ స్కూళ్లలో రెండో విడతలో నియామకమైన ఉపాధ్యాయులకు మెరిట్ ఆధారంగా సమన్యాయం జరిగేలా నోషనల్ సీనియార్టీని కల్పిస్తున్నట్టు తెలిపారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 194 మోడల్ స్కూళ్లలో సుమారు మూడు వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే ఈ ఉత్తర్వుల ప్రకారం కోర్టును ఆశ్రయించిన 1,326 మంది ఉపాధ్యాయులకు మాత్రమే ప్రయోజనం కలగనుంది. మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయులు ఒకే నోటిఫికేషన్ అయినప్పటికీ వివిధ దశల్లో నియామకమయ్యారు. దీంతో ఉపాధ్యాయుల మధ్య వేతన వ్యత్యాసం ఏర్పడింది. 2014లో నియామకమైన నర్సింహారెడ్డితోపాటు 128 మంది ఉపాధ్యాయులు హైకోర్టును తొలుత ఆశ్రయించారు. విచారణ తర్వాత 2013లో నియామకమైన ఉపాధ్యాయులతో సమానంగా 2014లో నియామకమైన పిటిషనర్లకు ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి మూలవేతనం సమానంగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులు హైకోర్టును ఆశ్రయించిన పిటిషనర్లకే వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఆ తీర్పు తర్వాత మిగిలిన 1,198 మంది ఉపాధ్యాయులు కూడా కోర్టులో పిటిషన్ వేశారు. విచారణ తర్వాత ఈ ఏడాది జులై ఒకటి నుంచి ఆ ప్రయోజనాలను అమలు చేయాలని కోరింది. దీంతో 1,326 మంది మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు నోషనల్ సీనియార్టీ లభించనుంది. ఈ ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఎట్టకేలకు మోడల్ స్కూల్ టీచర్లకు సమన్యాయం : టిఎస్‌యుఎఫ్

ఒకే పరీక్ష ద్వారా ఎంపికై రెండు విడతల్లో నియామకమైన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు మెరిట్ ఆధారంగా సమన్యాయం జరిగేలా నోషనల్ సీనియార్టీని కల్పిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హర్షం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ ఒక ప్రకటన విడుదల చేశారు. 12 ఏండ్లుగా జరిగిన అన్యాయం సరిదిద్దబడిందని తెలిపారు. కానీ నోషనల్ సీనియార్టీ వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను వాస్తవంగా నియామకమైన తేదీ నుంచి కల్పించాలని పేర్కొన్నారు. అందుకు భిన్నంగా ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి/జులై ఒకటి నుంచి మాత్రమే కల్పించడం అన్యాయమని తెలిపారు. ఈ ఉత్తర్వులను సవరించి నిబంధనల మేరకు నియామకపు తేదీ నుంచి ఆర్థిక ప్రయోజనం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్ టీచర్లకు న్యాయం : టిఎస్ఎంఎస్‌టిఎఫ్

ఎట్టకేలకు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగిందని టిఎస్ఎంఎస్‌టిఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ మహేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే నోటిఫికేషన్‌తో ఎంపికై వివిధ దశల్లో నియామకమైన ఉపాధ్యాయుల వేతనాల్లో వ్యత్యాసం ఉండడం సరైంది కాదని తెలిపారు. తొలుత నియామకమైన టీచర్లతో సమానంగా నోషనల్ సీనియార్టీని కల్పిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు : టిఆర్‌టిఎఫ్

2014 సెప్టెంబర్‌లో నియామకమైన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 2013 జూన్ మొదటి విడతలో నియామమైన టీచర్లతో సమానంగా పే, సీనియార్టీని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి ఎం అంజిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉత్తర్వులతో మోడల్ స్కూల్ టీచర్లకు ఊరట లభించిందని పేర్కొన్నారు.

చారిత్రాత్మక నిర్ణయం : టిఎంఎస్‌టిఎ

విద్యాశాఖ ఉత్తర్వుల వల్ల లబ్ధి పొందుతున్న ఉపాధ్యాయులు 1,326 మంది ఉన్నారని టీఎంఎస్టీఏ అధ్యక్షులు భూతం యాకమల్లు, ప్రధాన కార్యదర్శి కె నగేశ్ తెలిపారు. ఇందులో పీజీటీలు 768 మం, టీజీటీలు 558 మంది టీచర్లున్నారని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పిఎంటిఎటిఎస్ హర్షం

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నోషనల్ సర్వీస్‌తోపాటు పే పారిటీ వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల పిఎంటిఎటిఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం వల్ల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు మూలవేతనం పెరుగుతుందని తెలిపారు. 2013 జూన్ నుంచి 2014 సెప్టెంబర్ వరకు సర్వీస్ కూడా కలవడం వల్ల లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పైసలిచ్చినా ఓట్లు వేయరా?

ఓటర్లతో గొడవకు దిగిన బిఆర్‌ఎస్ కార్యకర్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయిన ఓ అభ్యర్థి అనుచరులు ఓటర్లతో గొడవకు దిగారు. డబ్బులు తీసుకొని ఓటు వేయలేదంటూ వాగ్వాదానికి దిగారు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం భీమ్లా తండాలో జరిగింది. గ్రామంలో బిఆర్‌ఎస్ మద్దతుగా పోటీ చేసిన సరితపై కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసిన లక్ష్మీ గెలుపొందారు. దాంతో డబ్బులు ఇచ్చినప్పటికీ ఓట్లు వేయలేదంటూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఓటర్లతో గొడవపడ్డారు. ఈ సందర్భంగా ఇరు పార్టీల మధ్య తోపులాట జరిగింది. మాట మాట పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. ఎస్‌ఐ మధుకర్ రెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకొని ఇరువురిని చెదరగొట్టారు. డబ్బులిచ్చినా ఓట్లు వేయలేదంటూ సరిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. దాంతో భీమ్లా తండా వాసులు డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వైద్య విద్య ప్రమాణాలు పెంచండి

- పరిశోధనలకు పెద్దపీట వేయండి
- పిజి, సూపర్ స్పెషాలిటీ సీట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి
- పెరిగిన కాలేజీలకు అనుగుణంగా హెల్త్ యూనివర్సిటీ బలోపేతం
- ఉన్నతాధికారులతో సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యులుగా పట్టా పుచ్చుకోవడమే కాకుండా వారు పరిశోధనా రంగంలోనూ రాణించేలా ప్రోత్సహించాలని, వైద్య విద్య ప్రమాణాలను పెంచాలని అధికారులను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అప్పుడే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతామని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వైద్యవిద్యపై సమీక్ష నిర్వహించారు. అందులో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ నాగార్జునరెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు మెడికల్ కాలేజీల పనితీరు, విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా బోధన నాణ్యతపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. పలు కీలకాంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై నియమించిన ఎంసిఎంసి (మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ) కమిటీలు ప్రతి నెలా నివేదికలివ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. దానివల్ల నిరుపేద విద్యార్థులకు ఉన్నత వైద్యవిద్య అందుబాటులోకి రావడంతో పాటు, ప్రభుతాస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల సేవలు మెరుగుపడతాయని తెలిపారు. మెడికోలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పిజి అడ్మిషన్ల కౌన్సిలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల సంఖ్య గణనీయంగా పెరిగిందనీ, పెరిగిన కాలేజీలు, యుజి, పిజి సీట్ల సంఖ్యకు అనుగుణంగా కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో పరిపాలనా సౌలభ్యం కోసం అధికారులు, సిబ్బంది సంఖ్య పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని హెల్త్ సెక్రటరీ, వీసీలకు సూచించారు. పరీక్షల నిర్వహణలో మరింత పారదర్శకత, వేగం కోసం ఎగ్జామినేషన్ బ్రాంచ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. యూనివర్సిటీ కార్యకలాపాలన్నింటినీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలనీ, తద్వారా విద్యార్థులకు సేవలు వేగవంతంగా అందుతాయని తెలిపారు.

వెల్‌స్పన్ లివింగ్‌కు ఎస్‌అండ్‌పి గుర్తింపు

ముంబయి : హోమ్ సొల్యూషన్స్ విభాగంలో ప్రపంచ వ్యాప్తంగా అగ్రగామి సంస్థ అయిన వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ (డబ్ల్యుఎల్ఎల్) టెక్స్‌టైల్, అపెరల్, లగ్జరీ గూడ్స్ విభాగంలో ఎస్‌అండ్‌పి గ్లోబల్ కార్పొరేట్ సస్టెనబిలిటీ అసెస్‌మెంట్‌లో 90 స్కోరును సాధించినట్లు ఆ సంస్థ తెలిపింది. దీంతో టెక్స్‌టైల్ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా నంబర్ 1 స్థానంలో వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్‌ను నిలబెట్టిందని పేర్కొంది. ఈ విభాగంలో భారతదేశం నుండి అత్యున్నత ర్యాంకు పొందిన టెక్స్‌టైల్ తయారీ సంస్థగా గుర్తింపు పొందినట్లు తెలిపింది.

ఎన్‌ఆర్‌ఐల కోసం ఐడిఎఫ్‌సి ఫస్ట్ గ్లోబల్ సేవింగ్స్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ తమ 'ఐడిఎఫ్‌సి ఫస్ట్ గ్లోబల్ సేవింగ్స్' ఖాతాను అమెరికన్ డాలర్లు, యూరోలలో ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇది ప్రవాస భారతీయుల (ఎన్‌ఆర్‌ఐ) కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపింది. ఈ ఆఫర్ దేశీయ లేదా ఎన్‌ఆర్‌ఐ సేవింగ్స్ ఖాతా కు భిన్నంగా ఉంటుందని.. విదేశీ కరెన్సీలలో సేవింగ్స్ ఖాతాలను నిర్వహించాలనుకునే కస్టమర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందని ఆ బ్యాంక్ ప్రతినిధి ఆశిష్ సింగ్ పేర్కొన్నారు.

వేములవాడలో ఓయాసిస్ ఫెర్టిలిటీ క్యాంపెయిన్

హైదరాబాద్ : ఓయాసిస్ ఫెర్టిలిటీ దేశవ్యాప్తంగా ఫెర్టిలిటీ అవగాహన పెంచే లక్ష్యంతో చేపట్టిన ఓయాసిస్ జనని యాత్ర వేములవాడలో జరిగిందని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఫెర్టిలిటీపై అవగాహన, నిపుణుల మార్గదర్శకం, ఫెర్టిలిటీ స్క్రీనింగ్ సేవలను నేరుగా ప్రజలకు అందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని ఓయాసిస్ ఫెర్టిలిటీ కో ఫౌండర్ డాక్టర్ దుర్గా జి రావు పేర్కొన్నారు. ఓయాసిస్ జనని యాత్ర బస్సు దంపతులకు ఉచిత ఫెర్టిలిటీ సంప్రదింపులు, ఉచిత ఎఎంహెచ్ పరీక్ష, ఉచిత వీర్య పరీక్ష, ఉచిత హీమోగ్లోబిన్ పరీక్షలు వంటి సేవలను అందిస్తోందన్నారు.

అమెజాన్ పేలో ఫేస్ స్కాన్‌తోనూ చెల్లింపులు

న్యూఢిల్లీ : యుపిఐ చెల్లింపులకు ఇక ప్రతీసారి పిన్ నెంబర్‌ను నమోదు చేయవల్సిన అవసరం లేకుండా బయోమెట్రిక్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు అమెజాన్ పే తెలిపింది. ఫేస్ స్కాన్ లేదా ఫింగర్ ప్రింట్‌ను ఉపయోగించి వినియోగదారులు లావాదేవీలను జరపవచ్చని పేర్కొంది. రూ.5,000 వరకు లావాదేవీల కోసం బయోమెట్రిక్‌ను ఉపయోగించుకోవచ్చని అమెజాన్ ఇండియా పేమెంట్స్ డైరెక్టర్ గిరీష్ కృష్ణన్ వెల్లడించారు. డిజిటల్ చెల్లింపులు ఎల్లప్పుడూ సౌకర్యవంతంగా, సురక్షితంగా చేయడమే తమ లక్ష్యమన్నారు.